www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి | భద్రాద్రి
సోమవారం | 11 | నవంబర్ | 2024
పేజీలు 8

## పత్తా లేని ఆర్టికల్చర్ అధికారి అపర్ణ




-ఇక్కట్లకు గురవుతున్న ఉద్యాన, చిల్లి, రైతులు
-మండల వ్యవసాయ అధికారితో బారులు తీరుతున్న చిల్లి (మిర్చి) రైతులు

2 లో

# సిఎంఆర్ కథ కంచికేనా..?

- ఈ జాప్యం దేనికి సంకేతం
- పాత్రధారులు, సూత్రధారులు ఊపిరిపీల్చుకున్నట్లేనా


(ఫైల్)



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సిఎంఆర్ రైస్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కథ కంచికి చేరిందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం వద్ద నుంచి ధాన్యాన్ని తీసుకుని తిరిగి బియ్యాన్ని ఇవ్వాల్సిన మిల్లర్లు ధాన్యం తీసుకున్నారు కానీ ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకపోవడంతో సమస్య వెలుగులోకి వచ్చింది. గత రెండు, మూడేళ్లుగా ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పలువురు రైస్‌మిల్లర్లు రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకుని ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని మాత్రం ఇవ్వకుండా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. ఖమ్మంజిల్లాలో మూడేళ్ల నుంచి ఈ తంతు జరుగుతున్న పౌర సరఫరాల శాఖాధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఒకట్రెండు ఆరోపణలు వచ్చినప్పటికీ అధికార యంత్రాంగం అంతగా స్పందించ లేదు. అశ్వారావుపేటకు సంబంధించి గతంలో ఒక రైస్ మిల్లును సీజ్ చేసినా ఫలితం లేకపోయిందన్న

మిగతా 2లో..

## నష్టాలు మిగిల్చిన పత్తి..
# మొక్కజొన్నపైనే ఆశలు..!

-పత్తిని తొలగిస్తున్న రైతులు - మొక్కజొన్న సాగుకు సమాయత్తం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈ ఏడాది పత్తి సాగు రైతులకు కష్టాలను, నష్టాలను మిగిల్చింది. లాభాలు రాకపోయినా నష్టం రాదన్న ఆలోచనలో రైతులు పత్తిని సాగు చేస్తుంటారు. కానీ ఈ ఏడాది పరిస్థితి తారుమారైంది. అతివృష్టి ఇతర కారణాలతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పత్తి సగటు దిగుబడి ఎనిమిది క్వింటాళ్లు ఉండగా అదునులో సాగు చేసిన రైతులకు పది నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటాళ్లకు మించి

మిగతా 2లో..

## ప్రజా ఉద్యమాల సారథి సిపిఐ

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



2 లో

## వాడవాడలా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుందాం

-సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



2 లో

# సిఎంఆర్ కథ కంచికేనా..?

(మొదటిపేజీ తరువాయి)



(ఫైల్)

ఆరోపణలు వినపడ్డాయి. అయినా అధికారులు ఉదాసీన వైఖరి అవలంభించారు. గడిచిన రెండు, మూడేళ్లుగా ప్రభుత్వమే రైతుల వద్ద నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండడంతో అధికారులే రైస్ మిల్లర్లతో సంప్రదించి దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. కొందరు మిల్లు యజమానులైతే తమకు అవసరం లేదన్నట్లు బెట్టు చూపినా మిల్లర్లకు ధాన్యం అప్పగించక తప్పని స్థితి. కాని మనం అప్పగించిన ధాన్యం ఎంత తిరిగి మనకు వచ్చినదెంత అని లెక్కలు వేసి రాని మిల్లర్ల నుంచి బియ్యాన్ని రాబట్టడంలో ఖమ్మం జిల్లా పౌర సరఫరాల అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు కొణిజర్ల మండలంలోని ఎస్ఎఆర్ రైస్ ప్రోడక్ట్స్ మిల్లుపై దాడిని నిర్వహించి మొత్తం గుట్టును రట్టు చేశారు. మిల్లు యజమాని విజిలెన్స్ లెక్కల ప్రకారం జరిమానాతో సహా రూ.81 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఆ తర్వాత మొదటి నోటీసు ఇచ్చినా స్పందించక పోవడంతో రెండవ నోటీసు ఇస్తున్నామని అప్పుడు కూడా స్పందించకపోతే సంబంధిత ఆస్తులను జప్తు చేస్తామని అధికారులు హెచ్చరిస్తూ మరో నోటీసు జారీ చేశారు. ఈ నోటీసుకు కూడా ఆ వైపు నుంచి స్పందన వచ్చిందా లేదన్నది ఇంత వరకు బహిర్గతపర్చలేదు. నోటీసుకు స్పందించి ప్రభుత్వానికి రావాల్సిన రూ. 81 కోట్లను ఎస్ఎఆర్ రైస్ ప్రోడక్ట్స్ మిల్లు యాజమాన్యం చెల్లించిందా లేదా అన్నదానిపై అధికారులు ఎందుకో మౌనం పాటిస్తున్నారు. చెల్లించారా చెల్లించకపోతే ఎందుకు చెల్లించలేదు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటో వివరించాల్సి ఉంది. కొణిజర్ల మండలంలోనే మరో రైస్ మిల్లుకూడా ఇదే తరహాలో వ్యవహరించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ జాప్యం దేనికి సంకేతమన్న ప్రశ్నకు అధికారుల వద్ద సరైన సమాధానం లేదు. అంత బహిర్గతమై అధికారులు జరిమానాతో సహా లెక్కలు చేసిన తర్వాత వసూలు చేయడంలో జాప్యం చేస్తే తగు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో అందరూ ఇతే రీతిగా వ్యవహరిస్తారన్న నిజాన్ని అధికార యంత్రాంగం గ్రహించడం లేదు. ఈ ఏడాది రైస్ మిల్లులకు ధాన్యం ఇచ్చే ముందు తగిన ఆస్తుల పూచీకత్తు ఇవ్వాలని నిబంధన విధించిన అధికారులు గతంలో ఎగవేసిన మిల్లులపై చర్యల విషయంలో ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా ఖమ్మంజిల్లా పౌర సరఫరాల శాఖలోనే అవినీతి తిమింగలాలు ఉన్నాయని ఈ మొత్తం కూపి లాగితే ఉన్నతాధికారులు సహా అనేక మంది దోషులుగా తేలే అవకాశం ఉందని ఆరోపణలు వినవస్తున్న నేపథ్యంలో సిఎంఆర్ రైస్ అవినీతికి సంబంధించి సమగ్ర విచారణ జరిపించాలని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే ఈ విషయమై పలు సంఘాలు ఆందోళనలు సైతం నిర్వహించాయి. ఇదిలా ఉండగా కొందరు ప్రజాప్రతినిధుల అండతో సిఎంఆర్ రైస్ వ్యవహారం కథ కంచికి చేరిందని ఇక ఎవరు ఏ చర్యలు తీసుకున్న కంటితుడుపుకేనన్న చర్చ సాగుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించి చర్యలను బహిర్గతం చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# పత్తా లేని ఆర్టికల్చర్ అధికారి అపర్ణ

**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి మండలంలో ఉద్యా న పట్టు పరిశ్రమల శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అపర్ణ రైతులకు అందుబాటులో లేక పోవడంతో మండలంలోని అనేక గ్రామాలలో రైతులు అవస్థలు పడుతున్నారు. వివరాల్లోకి వస్తే మండలంలోని చేగొమ్మ గ్రామంలో 2017 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గ స్థాయిలో ఉద్యాన నర్సరీ కేంద్రంను మండలంలోని చేగొమ్మ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి ప్రత్యేకంగా ఒక ఆర్టికల్చర్ అధికారిని కేటాయిస్తూ కూసుమంచి మండలం తో పాటు ఇతర మండలాలలో సాగు చేస్తున్న రైతుల ఉద్యానవన పంటల తో పాటు ముఖ్యంగా చిల్లి (మిర్చి) పంట సాగు చేస్తున్న రైతులకు పంటలను అంచనా వేయడానికి ఇంకా మిర్చి పంటలకు సోకుతున్న వివిధ రకాల తెగుళ్ల విషయాలపై రైతులకు కావలసిన సలహాలు సూచనలు రైతులకు ప్రభుత్వం నుంచి అందించే సమాచారాలు పంట నష్టం ఇన్సూరెన్స్ మొదలైన అవసరాల కొరకు ఆర్టికల్చర్ అధికారిని కేటాయించగా క్రితం లో పనిచేసిన వారు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన అపర్ణ ఇప్పుడు రైతులకు అందుబాటులో ఉండడం లేదని కూసుమంచి మండలంలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు లోక్యా తండా, గైగోల్లపల్లి, చేగోమ్మ, లాల్ సింగ్ తండా, సంధ్యా తండా, మునిగేపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్టికల్చర్ అధికారి అపర్ణ ఫోన్ నెంబర్ 7997725129 నెంబర్ కు ఫోన్ చేసినా కూడా ఫోను కలవట్లేదని అసలు ఆర్టికల్చర్ అధికారి కూసుమంచి మండలానికి ఉన్నట్టా లేనట్టా బదిలీ అయినట్టా ఏమై నట్టు అని రైతులు చర్చించుకుంటున్నారు. ఆమె కోసం ఎదురు చూడలేక ప్రస్తుతము అందరికీ అందుబాటులో ఉన్న మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి ని రైతులు సంప్రదిస్తూ వారు వారి మిర్చి తోటలకు తీసుకెళ్లి మిర్చి పంటలకు వచ్చిన తెగుళ్లపై ఇంకా శనగ పంటలకు సోకిన తెగుళ్లపై కూడా సలహాలు తీసుకొని పామాయిల్ సాగు ఇంకా సస్యరక్షణ చర్యలు చేపడుతూ (మందులు కొడుతూ) పంటలను కాపాడుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉద్యాన శాఖ ఉన్నత అధికారులు కల్పించుకొని కూసుమంచి మండలానికి రైతులుకు అందుబాటులో ఉండే ఉద్యాన శాఖ అధికారిని పూర్తిస్థాయిలో కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

వివరణ ఆర్టికల్చర్ అధికారి రైతులకు అందుబాటులో లేని విషయంపై ప్రజాపక్షం విలేకరి అధికారి అపర్ణ కు ఫోన్ లో వివరణ కోరుటకు ప్రయత్నించగా ఫోను అందుబాటులో లేకపోవడం (ఫోను కలవకపోవడం) విచారకరం.

# ప్రజా ఉద్యమాల సారథి సిపిఐ

**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ నిరంతరం ప్రజాఉద్యమాల సారథి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతురావు అన్నారు. సిపిఐ 100 సంవత్సరాల సందర్భంగా మండల కేంద్రం కొణిజర్లలో సిపిఐ సీనియర్ నాయకులు కొణిజర్ల మాజీ సర్పంచ్ బండారు హనుంతురావు సతీమణి రాధమ్మకు ఆదివారం సిపిఐ సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాగం హేమంతురావు మాట్లాడుతు ప్రజాసమస్యలు ఉన్నంతవరకు సిపిఐ పార్టీ ఉంటుందని ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా సిపిఐ పనిచేస్తుందని తెలిపారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని అన్నవరం , రామనర్సయ్యనగర్ తోపాటు చుట్టుప్రక్కల గ్రామాల్లోని పోడు రైతులకు పోడు భూములు పంచిపెట్టిన ఘనత సిపిఐ కే దక్కుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే రజబ్ అలీ నిధుల నుంచి అన్నవరం గ్రామాన్ని అభివృద్ధి చేసి రోడ్లు , ఇండ్లు నిర్మించిన ఘనత సిపిఐకే దక్కుతుందని అన్నారు. నిత్యం ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా సిపిఐ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎన్నో కష్టనష్టాల కోర్చి ఎంతో కష్టపడి పంటలు పండించినా రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో , దళారీ వ్యవస్థను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపించారు. పంటలకు భీమ పథకం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు , పించన్‌లు పార్టీలకతీతంగా పక్షపాతం లేకుండా ఇవ్వాలని అన్నారు. సాదాబైనామాద్వారా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీచేసేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు మాజీ జెడ్పీటిసి దొండపాటి రమేష్ , కొణిజర్ల శాఖ కార్యదర్శి స్వర్ణ రమేష్ , నాయకులు తండు సోమయ్య, పుట్ట సత్యనారాయణ , కొమ్మినేని వెంకయ్య, కొణిజర్ల మాజీ ఉపసర్పంచ్ గొడ్డుగొర్ల శ్రీను , కాల్వకట్ట ప్రసాద్ , షేక్ సైదులు , ఎండి రజాక్ , దొండపాటి కిషన్‌రావు , పాముల వీరేశం , బొడపోతు లక్ష్మయ్య, కొప్పురావూరి వెంకటేశ్వరరావు బండారు రాధమ్మ , బండారు మల్లిఖార్జున్‌రావు , భాస్కర్ , ముత్తయ్య, సత్యం , నగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా సిపిఐ వందేళ్ల ఉత్సవాలు జరుపుకుందాం



**ప్రజాపక్షం/పాల్వంచ:** డిసెంబర్ 26 నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో వాడవాడలా వందేళ్ల ఉత్సవాలను ఘనంగా నిర్వహించి పార్టీ చరిత్రను, త్యాగాలను ప్రజలకు వివరించాలని, ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో పట్టణ కౌన్సిల్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథగా హాజరైన ఆయన మాట్లాడుతూ 2025 సభ్యత్వ చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యాలను పూర్తి చేసి గ్రామ స్థాయి, మండల స్థాయి మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని కోరారు. ఇటీవల పాల్వంచలో పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించడం జరిగిందని, ఈ సమావేశంలో పలు అజెండా అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజలకు చేస్తున్న సేవలు, కూనంనేని నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇటీవల వందల సంఖ్యలో పార్టీలో చేరారని, వీరికి ప్రాథమిక సభ్యత్వం అందించి పార్టీ శిక్షణాతరగతులు నిర్వహించాలన్నారు. పాల్వంచ ప్రాంత సమగ్ర అభివృద్ధిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే వివిధ పథకాలతో రోడ్లు, డ్రైన్లు, నీటి పథకాలు శరవేగంగా పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన పనులు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. ఏఐటియూసి పట్టణ కార్యదర్శి ఇట్టి వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమిల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీ పద్మజ, ప్రజాసంఘాల నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండ్ అస్లం, నరహరి, నాగేశ్వరరావు, ఉపేంద్ర చారి, మన్యం వెంకన్న, ఉప్పుశెట్టి సునీల్, కుర్రు రమేష్, శెట్టి చెరలు, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, కసర్ల రామారావు, ఎస్‌కె రెహమాన్, కరీం, గోపి, వెంకన్న, సంఘ మిత్ర, రాకేష్, శంకర్, బిక్కులాల్, జ్యోతుల రమేష్, శంకర్, రవి, జిలాని, కుమార్, సత్యనారాయణ, ఆదినారాయణ, ఎస్‌కె లాల్ పాషా, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టాలు మిగిల్చిన పత్తి..

# మొక్కజొన్నపైనే ఆశలు..!



(మొదటిపేజీ తరువాయి)

దిగుబడి రావడం లేదు. అధిక వర్షాలు, దానికి తగినట్లు తెగుళ్లు రావడంతో పత్తి చేలు ఏపుగా పెరగలేదు. తెగుళ్ల నివారణకు రైతులు పెద్ద మొత్తంలో క్రిమి సంహారక మందులను వినియోగించారు. 90 శాతం మంది పత్తి రైతులకు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాలేదు. కౌలు రైతుల పరిస్థితి మరి దయనీయం. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో పూర్తిగా నష్టపోయిన మెట్ట రైతులు రబీలో మొక్కజొన్న అయినా తమను రక్షిస్తుందన్న ఆశతో పత్తిని తొలగించి మొక్కజొన్న సాగుకు సమాయత్తం అవుతున్నారు. గతేడాది రబీలోను ఈ ఏడాది ఖరీఫ్‌లోను మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో పాటు ధర కూడా ఆశించిన రీతిలో ఉండడంతో ఈ ఏడాది కూడా కలిసి వస్తుందన్న ఆలోచనతో మొక్కజొన్న వైపుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. పత్తి దిగుబడి రాకపోవడం ఒక ఎత్తయితే మార్కెటింగ్ రైతులను నిండా ముంచింది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,521కు క్వింటా పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రైతుల వద్ద నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు నానా కొర్రీలు పెడుతుంది. ఖమ్మంజిల్లాలో ప్రైవేటు పత్తి వ్యాపారులు కొనుగోలు చేసిన దానిలో ఒక శాతం కూడా సిసిఐ కొనుగోలు చేయలేదంటే ఆశ్చర్యం కలుగక మానదు. ప్రైవేటు వ్యాపారులు ఐదు వేల మెట్రిక్ టన్నులు పత్తిని కొనుగోలు చేస్తే సిసిఐ కొనుగోలు చేసింది 150 మెట్రిక్ టన్నులు పై చిలుకు మాత్రమే రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసేటప్పుడు మాత్రం రకరకాల కారణాలు చెప్పి నిరాకరిస్తున్నారు. అయితే గతంలో ఖమ్మంజిల్లాలో సిసిఐ కొనుగోళ్లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయి. రైతుల వద్ద కొనుగోలు చేసేందుకు నిరాకరించిన సిసిఐ అధికారులు ప్రైవేటు వ్యాపారులు తీసుకు వచ్చిన పత్తిని మాత్రం నిరభ్యంతరంగా కొనుగోలు చేసి పెద్ద మొత్తంలో దండుకున్నట్లు ఆరోపణలు వినవచ్చాయి. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి జరుగుతుందేమోనన్న అనుమానం రైతుల నుంచి వ్యక్తమవుతుంది. రైతుల వద్ద నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు సిసిఐ అధికారులు నానా రకాల కొర్రీలు పెడుతూ పత్తి పండే ప్రాంతాలను వదిలిపెట్టి ధాన్యం ఎక్కువగా పండే ప్రాంతాలలో సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఈ అనుమానాలకు కారణమవుతుంది. పండిన కొద్దో గొప్పో కూడా రైతులు సరైన ధరకు విక్రయించలేని దయనీయ స్థితి. ఈ పరిస్థితుల్లో ఖరీఫ్‌లో పత్తి సాగు చేసిన రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి వ్యర్థాలను తొలగించి విత్తనాలు నాటేందుకు కొందరు సిద్ధమవుతుండగా కొద్ది శాతం మంది రైతులు ఇప్పటికే మొక్కజొన్న విత్తనాలు నాటారు. మరీ మొక్కజొన్న దిగుబడి, ధర ఏవిధంగా ఉంటుందో వేచి చూడాలి.

# త్యాగాల పునాదులపై నిర్మించింది సిపిఐ

## -సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



**ప్రజాపక్షం/బోనకల్:** అనేక త్యాగాల పునాదులపై నిర్మించబడింది సిపిఐ అని, దోపిడి ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం అదివారం నిర్వహించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తెలంగాణ సాయుధ పోరాట యోధులు పారుపల్లి రాఘవులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావులతో కలిసి ఆయన ప్రారంభించారు. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు పోరాడింది కమ్యూనిస్టులేనని అన్నారు. 1969 బ్రాహ్మణపల్లిలో నాటి తుఫాన్ కారణంగా వందలాంది మంది పేదలకు, బడుగు బలహీన వర్గాల ప్రజలు నిరాశ్రయులు అయ్యారని, వారికి అండదండా నిలిచి ఊరిని నిర్మించడంలో కమ్యూనిస్టుగా కొంగర అప్పయ్య కీలకభూమిక పోషించరన్నారు. అమరులు పారుపల్లి చిన్నకోటయ్య, వంగాల పెద్ద వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల రాజారత్నంలు అనేక మంది త్యాగాలతో 30 సంవత్సరాల పైగా గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసి, ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించరన్నారు. యువత కమ్యూనిస్టు పార్టీలో చేరి గౌరవప్రదమైన రాజకీయాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు పారుపల్లి నరసింహారావు,కొంగర రామారావు, ఏలూరి రమేష్, మడుపల్లి వెంకటేశ్వర్లు, వంగాల నరసింహ, చావా నాగయ్య, గుడిద నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పేదల, శ్రమజీవుల సంక్షేమమే కమ్యూనిస్టుల ధ్యేయం

## -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/బోనకల్:** పేదలు, శ్రమజీవుల సంక్షేమమే కమ్యూనిస్టుల ధ్యేయమని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. ముష్టికుంట్ల గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం అదివారం నిర్వహించారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, చింతకాని మండల అధ్యక్షులు పావులూరి మల్లికార్జున్‌రావులతో కలిసి ఆయన సభ్యత్వాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కమ్యూనిజం భావజాలంతో భారతదేశంలో తొలిగా ఏర్పడ్డ రాజకీయ పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ మహిళలకు సామాజిక సమానత్వం, పెద్దలందరికీ ఓటు హక్కు, ప్రైవేట్ యాజమాన్యంలోని సంస్థల జాతీయం, భూ సంస్కరణలు, అట్టడుగు కులాలకు సామాజిక న్యాయం, సమ్మెల ద్వారా నిరసన తెలపడం వంటివి పార్టీ యొక్క ప్రజాదరణను పెంచాయని అన్నారు. ఎన్నో పార్టీలు వచ్చాయి, పోయాయని, అనేక త్యాగాల పునాదులపై నిర్మించబడిందని, దోపిడి ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీలు ఉంటాయని తెలిపారు. నేటికి సిపిఐ ఆవిర్భవించి 110 సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా సిపిఐ శ్రేణులు నూతన ఉత్తేజంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, సిపిఐ శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బోయినపల్లి బసవయ్య, కొంగర భాస్కరరావు, బోళ్ల ప్రసాదరావు, జక్కా సుశీల, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# విహార యాత్రకు తలసేమియా చిన్నారులు

## చీరాల బీచ్‌లో ఉల్లాసంగా గడిపిన చిన్నారులు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల్లో మానసిక ఉల్లాసాన్ని నింపేందుకు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులను విహార యాత్రకు తీసుకెళ్లారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులను ఆర్టిసి బస్సులో ఖమ్మం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చీరాల బీచ్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ ప్రొద్దుటూరు అనిత మాట్లాడుతూ నిత్యం రక్తం ఎక్కించుకుంటూ మందులు వాడుతున్న చిన్నారులను ఆ బాధ నుండి బయటకు తీసుకు వచ్చేందుకు సంకల్ప సంస్థ అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. ప్రతి ఏడాది నవంబరు 14 చిల్డ్రన్స్‌డేను పురస్కరించుకుని చిన్నారులను పర్యాటక ప్రాంతాలకు, విహార యాత్రకు తీసుకెళ్తామని ఆమె తెలిపారు. చిన్నారుల కోరిక మేరకు ఈ ఏడాది సముద్రం చూపించేందుకు చీరాల బీచ్‌కు చిన్నారులను తీసుకెళ్లినట్లు తెలిపారు. తలసేమియా వ్యాధి అనేది తమకు ఉందనే భావన నుండి చిన్నారులను బయటకు తీసుకు వచ్చేందుకు సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతిక కార్యక్రమాలతో పాటు విహార యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. బీచ్‌లో సముద్ర అలల వద్ద చిన్నారులు ఆట పాటలతో చిన్నారులు సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షురాలు పి. పావని, కోశాధికారి పి. రవిచందర్, బాధ్యులు పి. ఉదయ్ భాస్కర్, ఎన్. ఉపేందర్, తలసేమియా చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పొలాల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండాలి

## - ఏదులాపురం సెక్షన్ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు
## - గుర్రాలపాడులో విద్యుత్‌శాఖ పొలం బాట



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా..రైతులు పొలాల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఏదులాపురం సెక్షన్ ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని గుర్రాలపాడు గ్రామంలో విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మోటర్ల వద్ద విద్యుత్ సరఫరా వైర్లు ఎలా?ఉన్నాయి, ఏమైనా? ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయ అని క్షుణ్ణంగా పరిశీలన చేసుకుని ఆన్ చేసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ నియంత్రికలు, ట్రాన్స్ఫర్మర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఏమైనా ప్రమాదకర పరిస్థితులు తారాసపడితే తక్షణమే విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మోటార్లకు కెపాసిటర్లు వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ కోటేశ్వరరావు, అసిస్టెంట్‌లైన్‌మెన్ యూసఫ్, లైన్‌ఇన్‌స్పెక్టర్ జాకీర్ షరీఫ్, హనుమాన్ డిస్ట్రిబ్యూషన్ కార్మికుడు ఏసు, రైతులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలో పర్యటించి పలు కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. ప్రముఖ వైద్యులు ఎస్. వెంకటేశ్వరరావు సతీమణి రమాదేవి ఇటీవల మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఖమ్మం బ్యాంక్ కాలనీకి చెందిన పాటిబండ్ల సుదర్శన్ తల్లి రాణి ప్రమీల ఇటీల మృతిచెందారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఇందిరానగర్‌కు చెందిన బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ఊర్మిళ తల్లి సౌభాగ్య ఇటీవల మృతి చెందగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. సంతాప కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, టేకులపల్లి సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, నాయకులు బుర్రి వినయ్‌కుమార్, షకీనా, వంగవీటి శ్రీను, పాషా, ఉస్మాన్, చారి, జగదీష్, కిషోర్, ఫ్రాన్సీస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ ఉద్యోగ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం తెలంగాణ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం ఖమ్మంజిల్లా శాఖ సర్వసభ్య సమావేశం రోటరీ నగర్ పాఠశాలలో జరిగింది. ఇప్పటి వరకు ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పనిచేసిన మందుల ఈదయ్య, తిగుళ్ల శ్రీనివాసరావును రాష్ట్ర కమిటీలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నూతన కమిటీని రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బానోత్ నాగులు, ప్రధాన కార్యదర్శిగా గుండెల మల్లేశ్వరరావు, కోశాధికారిగా మాచర్ల పృథ్వీ, సహాధ్యక్షులుగా బొల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గోవింద కృష్ణయ్య, జే. శ్రీనివాసరావు, కెఎంసి ఎల్లయ్య, జయరాం, మహిళా కార్యదర్శిగా ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీలుగా గుగులోత్ మోహన్, గరిక సాంబశివరావు, బొడ్డు వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నారాయణరావు, ఈసి మెంబర్లుగా రామకృష్ణ, గణేష్, రమాదేవి, కృష్ణప్రసాద్, రాజేష్ కుమార్‌లను ఎన్నుకున్నారు. దివ్యాంగ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ ఆధ్వర్యంలో కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు బి.నాగులు తెలిపారు. నూతన కమిటీకి పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# యోగా పోటీల్లో సీతారాములుకు గోల్డ్‌మెడల్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ఖమ్మంకు చెందిన కోమాకుల సీతారాములు ద్వితీయ స్థానంతో పాటు గోల్డ్ మెడల్ అందుకున్నారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల యోగాసనాల ఛాంపియన్ షిప్ పోటీల్లో 60 ఏళ్లు పైబడిన కేటగిరిలో ఖమ్మంకు చెందిన సీతారాములు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సీతారాములు ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానంతో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో సీతారాములుకు సర్టిఫికెట్‌తో పాటు గోల్డ్ మెడల్ అందజేశారు. గోల్డ్ మెడల్ సాధించిన సీతారాములును గురుదక్షిణ ఫౌండేషన్ యోగా మాస్టర్ రమేష్, యోగా సాధకులు అభినందించారు.

# ప్రజలంతా సర్వేకు సహకరించాలి



**ప్రజాపక్షం/ చింతకాని :** సమగ్ర కుటంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఖమ్మం ఆర్డీవో గరిడ నర్సింహారావు సూచించారు. చింతకాని మండలం పందిళ్ళపల్లి గ్రామంలో ఆయన సర్వేను పరిశీలించారు. ఫామ్‌లో కోడ్ల ఆధారంగా అన్ని వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా ఆరా తీశారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సమగ్ర సమాచారాన్ని అందించాలని,తద్వారా పథకాల అమలుపై ప్రభుత్వానికి స్పష్టత వస్తుందన్నారు. అనంతరం పందిళ్ళ పల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించి కొత్త ఓటర్ల దరఖాస్తులు,తొలగింపుల కోసం మార్పుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు బిఎల్ఓను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు,గిర్దావర్ సోయం రఘు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రముఖ న్యాయవాది కాటంనేని రమేష్ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన నిశ్చితార్థ వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల యలగొండ స్వామి తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు కాటంనేని రమేష్ కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## పద్మశాలి యువత నైపుణ్య శిక్షణకు రూ.25 వేలు విరాళం



**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని ముష్టికుంట్ల పద్మశాలి యువత నైపుణ్య శిక్షణకు ప్రతి యేటా రూ.25 వేలు,పద్మశాలి సంఘానికి రూ. లక్ష విరాళంగా అందజేయనున్నట్లు మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ కొంగర వెంకటనారాయణ తెలిపారు. ముష్టికుంట్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస సందర్భంగా ప్రతి యేటా నిర్వహించే వనసమారాధన మహోత్సవము కార్యక్రమం ముష్టికుంట్లలో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని మాజీ పిఎసిఎస్ ఛైర్మన్ కొంగర వెంకటనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరావు సంఘం మాజీ అధ్యక్షులు పివి అప్పారావు, పిల్లలమర్రి నాగేశ్వరావు, సభ్యులు ఆకెన నారాయణ, పిల్లలమర్రి నాగేశ్వరావు, పి విద్యాసాగర్, చెరుకు హన్మంతరావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, కొదుమూరి పిక్చయ్య, కుందెన అప్పారావు, పర్వతం శ్రీను, చిట్యాల నాగరాజు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

## తెల్దారుపల్లిలో గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మంరూరల్ మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీనిని క్రీశేషులు తమ్మినేని కృష్ణయ్య నివాసంలో జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు తమ్మినేని నవీన్ సమక్షంలో జరిగింది. అధ్యక్షునిగా గజ్జి వీరబాబు, ఉపాధ్యక్షులుగా బోడపట్ల రమేష్, కార్యదర్శిగా చావా సతీష్, సహాయ కార్యదర్శిగా చాట్ల రవిలు,కమిటీ సభ్యులు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటమర్తి గోపయ్య, వేగినాటి రంగారావు, గజ్జి వీరభద్రం, ఇనుప రాంబాబు, నూకల ఉపేందర్, భూక్య వెంకన్న, బండారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/కారేపల్లి:** విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమాదేవి దంపతుల కుమారుడు మనోజ్, మౌనిక నూతన దంపతులను వివాహ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ నాయకులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మేదరి వీరప్రతాప్(టోనీ), మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు ఎండి హనీఫ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోత్ భీముడు నాయక్, తోటకూరి రాంబాబు, అజ్మీర నారాయణ, సొందు పాల్గొన్నారు.

## సీపీఎం మండల కార్యదర్శిగా నరేంద్ర



**ప్రజాపక్షం/కారేపల్లి:** సీపీఎం కారేపల్లి మండల కార్యదర్శిగా కే నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శి కే నరేంద్రతో పాటు మరో 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కే నరేంద్ర మూడో పర్యాయం కార్యదర్శిగా ఎన్నికైనారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్:, సీఐటీయు రంగాలలో పని చేసిన కే నరేంద సీపీఎం మండల కార్యదర్శిగా వరుసగా మూడు సార్లు ఎన్నికైనారు.

# విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు

**-పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి**
**-నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల పట్ల వివక్ష చూపుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించకుండా పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై చిన్నచూపు చూస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ రూ. 7,650 కోట్లు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ మానసిక ఆవేదన చెందుతున్నారని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని పదే పదే మాట్లాడిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేస్తామని చెప్పి 11 నెలలు గడుస్తున్నా నేటికి విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ వివక్ష చూపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో నూతన విద్యా విధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే ప్రయత్నంచేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు.యూనివర్సిటీలను మూడు నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్, కాషాయికరణ చేస్తుందని ఆయన ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానంలో ఎక్కడ కూడా ఉచిత విద్య అనే పదాన్ని పొందుపర్చలేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని, జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివానాయక్, రాకేష్, నాయకులు ప్రతాప్, సునీల్, గణేష్, ఉమామహేష్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యులు ఐక్యతతో కలిసి ఉండాలి

**రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు దోసపాటి**





**ప్రజాపక్షం/మణుగూరు రూరల్‌:** ఆర్యవైశ్యులు ఐక్యతతో ముందుకు సాగుతూ రాజకీయ, వైద్య, విద్య తదితర అన్ని రంగాల్లో ముందుంటూ, సమాజ సేవకు పాటుపడాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దోసపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని వెన్నెల జలపాతం వద్ద జరిగిన ఆర్యవైశ్య కార్తీక మాస వనభోజనం మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు దారా రమేష్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు పెండ్యాల రోజా లక్ష్మి లు హాజరై ఆర్యవైశ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజ సేవలో ముందున్నారని, మణుగూరు వరద బాధితులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో 300 నిత్యావసర కిట్లు అందించామని తెలిపారు. అలాగే వాసవి క్లబ్ నుండి అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదే ఒరవడిని కొనసాగిస్తూ భవిష్యత్తులో ఆర్యవైశ్యులందరూ ఏకతాటి పైకి వచ్చి, ఒకరికొకరు సహకారం అందిస్తూ అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అంగ రంగ వైభవంగా జరిగిన వన మహోత్సవ కార్యక్రమంలో వందలాది ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణుగూరు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండల ఆర్యవైశ్య అధ్యక్ష కార్యదర్శులను, మణుగూరు వాసవి, వనిత వైభవం క్లబ్ అధ్యక్ష కార్యదర్శులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. పిల్లలకు ఆట పాట కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా జిల్లా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, జిల్లా నాయకులు ఎలుగూరి నగేశ్ కుమార్, నియోజకవర్గ, మండల, పట్టణ ఆర్యవైశ్య ప్రతినిధులు కత్తి రాము, కోలేటి భవాని శంకర్, చిత్తలూరి రమేష్, బండారు నరసింహారావు, కడవండి విశ్వనాథ గుప్త, స్వరాజ్యరావు, కోటగిరి సందీప్, రేపాక వెంకన్న, చిన్న మస్తాన్, గాదం శెట్టి సుబ్రహ్మణ్యం, వందనపు వాసు, చిట్టురి శేషు బాబు, దింటకుర్తి బ్రహ్మయ్య, కేశ రాజేంద్రప్రసాద్, బొగ్గవరపు అంజలి, కొత్త ఇందుమతి, సుగ్గల భాను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పద్మశాలీ వన భోజన మహోత్సవం





**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని ముష్టికుంట్ల లో ప్రతి యేట కార్తీక మాసంలో నిర్వహించే పద్మశాలీ వన సమారాధన మహోత్సవం ఘనంగా ఆదివారం నిర్వహించారు. పిల్లల ఆటపాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గత 20 యేళ్లుగా పద్మశాలీ వన సమారాధన మహోత్సవాలను నిర్వహించడం జరుగుతుంది. ముష్టికుంట్ల పద్మశాలీ సంఘం అధ్యక్షులుగా చిట్యాల సీతయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, ఆకెన నారాయణ, పిల్లలమర్రి వెంకటఅప్పారావులు సంఘం అభివృద్ధికి కృషి చేశారు. నూతన పద్మశాలీ సంఘం అధ్యక్షులుగా పిల్లలమర్రి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా, 11 మంది కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షులు కొంగర వెంకటనారాయణ, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించిన పిల్లలమర్రి వెంకటఅప్పారావులను కమిటీ సభ్యులు, బంధుమిత్రులు శాలువలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నూతన సంఘం అధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఆకెన నారాయణ, పిల్లలమర్రి నాగేశ్వరరావు, పి విద్యాసాగర్, చెరుకు హన్మంతరావు, కొదుమూరి పిక్చయ్య, కుందెన అప్పారావు, పర్వతం శ్రీను, చిట్యాల నాగరాజు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

# మహా మాయగాడు ఈ మాటల పూజారి..!?

**-మంత్రం రాదు, తంత్రం తెలియదు...?**
**-కూలికి పోయే స్థాయి నుండి కోటీశ్వరుడిగా మారిన వైనం...?**
**-అమాయక భక్తులు,ఒంటరి మహిళలే ఈయన టార్గెట్ ...?**
**-క్షుద్రపూజలు,గుప్తనిధుల వేటలే కాదు, శృంగార క్రీడలో సైతం ఈ దొంగ పూజారి ఘనుడే..?**
**-నకిలీ మంత్రగాళ్ళపై పోలీసులు దృష్టిపెట్టాలంటున్న మండల ప్రజలు, నాస్తికులు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** మంత్రాలు రావు కాని ఈయన పూజారి, తంత్రం తెలయదు కాని ఈయన తంత్రగాడు, తాయత్తులు కట్టడు కాని మహామాయగాడు ఈ మాటల పూజారి. సమస్య ఏదైనా పూజలు చేస్తాడు. అర్ధరాత్రి క్షుద్రపూజలు, గుప్తనిధుల పూజల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసి భారీగానే గుంజుతూ ,ఒంటరి మహిళలను నయావంచనకు గురిచేస్తున్నాడు ఈ నకిలీబాబా,స్వామీజీ,గురూజీ అని కాకుండా పూజారీ అనే ఎందుకంటున్నామంటే ఈయన తాత,ముత్తాతలు దుర్గమ్మ,సమ్మక్క,సారలమ్మల పూజారులుగా కొనసాగారు కనుక ఇతనిని కూడా పూజారీ అని సంబోదిస్తున్నాం. వివరాల్లోకెళ్ళితే సత్తుపల్లి మండల శివారు,ఆంధ్రా సరిహద్దు గ్రామంలో ఓ దినసరి కూలీ తనని తాను సమ్మక్క,సారలమ్మ పూజారిగా చెబుతూ అమాయక ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాడు.తన ఒంటిపైకి దుర్గమ్మ వస్తుందంటూ చెప్పుకుంటున్న ఈ నకిలీ,పూజల పేరుతో అమాయక ప్రజల నుండి భారీగానే గుంజుతున్నాడు.నోటికొచ్చిన పదాలను పదే,పదే పలుకుతూ మెడలోని రుద్రాక్షలను మెడను తిప్పిచప్పుడు చేస్తూ ఒకటి నుండి నాలుగు వరకు అంకెలను లెక్కేస్తూ మాయ చేస్తాడు. మీ సమస్యను అమ్మలకు చెప్తానని ఒకటి,రెండు,మూడు పొద్దులలో మీ సమస్యను తీర్చుతానని,అప్పటికి సమస్య తీరకపోతే ప్రత్యేక పూజలు చేస్తే మీ పనులు జరుగుతాయని భారీగా డబ్బులు గుంజుతున్నాడు.అంతేకాకుండా ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుంటున్న ఈ నకిలీ పదుల సంఖ్యలో వివాహేతర సంబంధాలు కొనసాగిస్తున్నాడని గ్రామంలో గుస,గుసగా చెప్పుకోవటం విశేషం.ఈ మధ్య కాలంలోనే ఈ నకిలీ పూజారి గుట్టు రట్టై ఇంట్లో గొడవలు జరిగాయని భహిరంగంగానే చెప్పుకుంటున్నారు గ్రామస్థులు.గతంలో స్వగ్రామానికి చెందిన ఓ వ్యక్తికి పాము కరవటంతో సదరు వ్యక్తి ఈ నకిలీ పూజారి వద్దకు రాగా పాము కరిచిన ప్రదేశంలో కట్టిన కట్లను తొలగించిన నకిలీ మంత్రం వేయటంతో పరిస్థితి విషమించటం,అప్రమత్తమైన కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా ప్రాణం పోయినట్లు గ్రామంలో ఇప్పటికి గుసగుసలు వినిపిస్తున్నాయి.25 సంవత్సరాల నుండి పూజారిగా చలామణి అవుతున్న నకిలీ తన దర్శనానికి టోకెన్ సిస్టాన్ని ఏర్పాటు చేశాడు.టిక్కెట్టు ఇచ్చేందుకు శిష్యుడిని ఏర్పాటు చేసుకున్నాడు.ఒక్కో టిక్కెట్ ధర రూ.100 ఇలా ప్రతి రోజు ఉంటుంది.కాకపోతే సోమ,శుక్రవారాలలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది.ఆ రోజులలో సుమారు 100 నుండి 200 మంది వరకు వచ్చి టిక్కెట్టు తీసుకుని మరి జగన్నాదం అలియాస్ పోతురాజును దర్శించుకుంటారు.భక్తులు అని కాకుండా సందర్శకులని ఎందుకంటున్నామంటే అక్కడ ఉన్నది గుడి కాదు,ఆయన పూజారి కాదు. ఓ చిన్న గదిలో దేవుళ్ళ ఫోటోలు ఏర్పాటు చేసి తాను పూజారి అవతారమెత్తాడు కనుక వచ్చే వారిని భక్తులు అనకుండా సందర్శకులు అంటున్నాం.ఇక్కడ మరో విషయం ఏమిటంటే హిందూ దేవుళ్ళ ఫోటోలతో పాటు అల్లా, ఏసుప్రభు ఫోటోలో కూడా ఏర్పాటు చేశాడండి బాబు అందరని మచ్చిక చేసుకోవటానికి.ఈ నకిలీకి ఒంటిపై 24 గంటలు దేవుడోస్తాడని,తనకు అన్నీ తెలుసని చెప్పకుంటూ వచ్చే వారిని బురిడీ కొట్టిస్తాడు.అంతేకాకుండా వచ్చిన వారిని మాటలతో మాయ చేసి వారి నుండే వారికున్న సమస్యలను తెలుసుకుని తిరిగి వాటినే ఆయన వారికి ఆయన స్టైల్లో చెప్పి బురిడి కొట్టిస్తాడు.నకిలీ బండారాన్ని బయట పెట్టాలనే ఉద్దేశ్యంతో ప్రజాపక్షం పత్రిక తరపున తామే ఓ టిక్కెట్టు తీసుకుని వెళ్ళి సందర్శకులతో పాటు కూర్చొని ఆయన గారడీని రికార్డ్ చేయ్యటమే కాకుండా,తాము కూడా తమ సమస్యలు గుర్తించి చెప్పమని ప్రశ్నించగా నకిలీ తెల్లముఖం వేశాడు.తమకున్న సమస్యలను నకిలీ ఒంటిపైకి వచ్చిన దేవుడిని గుర్తించమని అడిగితే పొంతన లేని మాటలు చెప్పటం ప్రారంభించాడు చేసేది లేక తామే తమకు ఓ 50 ఎకరాలకు సంబందించి ల్యాండ్ సెటిల్‌మెంట్ కావటం లేదని,తమకున్న ఓ 4 ఇండ్లు అమ్ముడు పోవటం లేదని ఏమి చేయాలని ప్రశ్నించగా మీరు మాలలలో ఉన్నారు.ఇరుముడి అయిన అనంతరం వస్తే ప్రత్యేక పూజలు చేస్తామని,అప్పటి వరకు ఒకటి,రెండు,మూడో పద్దు రావాలని చెప్పటం విశేషం.ఇలా తనకు లేని శక్తులు ఉన్నాయని అమాయక ప్రజలను మోసం చేస్తూ,ప్రత్యేక పూజల పేరుతో లక్షలు లాగేస్తూ,అమావాస్య రోజులలో దేయ్యాలను తరిమేస్తూ,పౌర్ణమి రోజులలో గుప్త నిధుల వేట కొనసాగిస్తూ,మద్య,మద్యలో వివాహేతర సంబందాలు పెంచుకుంటూ భారీగానే వెనకేసుకుంటున్నాడు ఈ నకిలీ పూజారి.ఈయన సంపాదించిన దాంట్లో గుళ్ళు ,గోపురాలు,ఉత్సవాలకు చందాలు బారీగానే ఇస్తున్నట్లు సమాచారం,ఈయన వద్ద దండిగా చందాలు తీసుకుంటున్న వారు ఆయనకు కొమ్ము కాస్తూ వెనకేసుకువస్తుండటంతో ఈ పూజారి ఆడిందే ఆటగా,పాడిందే పాటగా మారింది.

**కొసమెరుపు....**

ఈ నకిలీ పూజారి గుట్ట తెలిసిన గ్రామంలోని వారు ఒక్కరంటే,ఒక్కరు కూడా ఆయన వద్దకు రారంటే ఆశ్చర్యం కలుగుతుంది.త్వరలోనే ఈ నకిలీ బండారాన్ని బయటకు తీసి,నకిలీ ఆట కట్టించాలని సత్తుపల్లి పోలీసులు ఈ నకిలీ పూజారిపై ఓ కన్నేసి అమాయక ప్రజలు,మహిళలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.ఈయన గురించి మరింత సమాచారం త్వరలోనే అందజేస్తాం.

# ఆయిల్ ఫామ్ సాగు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగు చేసిన రైతులకు ప్రోత్సాహం అందిస్తుందని కొణిజర్ల మండల వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు. మండల పరిదిలోని సింగరాయపాలెంలో ఆదివారం ఆయిల్ ఫామ్ సాగుచేసిన పంటను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఆయిల్ ఫామ్ సాగు చేసిన ఎస్సీ , ఎస్టీ రైతులకు ప్రభుత్వం నూరు శాతం సబ్సీడి ఇస్తుందని బిసి , ఓసి రైతులకు 90 శాతం సబ్సీడి అందిస్తుందని అన్నారు. పంటసాగు చేసిన నాలుగు సంవత్సరాలవరకు అంతరపంటలు వేసినందుకుగాను ఎకరానికి రూ 4 , 200 లు రైతు అకౌంట్ లో నేరుగా వేస్తారని తెలిపారు. ఉపాధిహామి పథకం ద్వారా ఒక కుటుంబానికి 5 ఎకరాలవరకు మొక్కలు వేయించి మొక్కలు చూసుకున్నందుకుగాను 3 సంవత్సరాలవరకు కొంత నగదును అకౌంట్ లో జమచేస్తారని తెలిపారు. నీటి అవకాశం ఉన్న రైతులు ఆయిల్‌ఫామ్ పంటను సాగు చేయాలని అన్నారు. ప్రస్తుతం వ్యవసాయానికి గ్రామాల్లో కూలీల కొరత బాగా ఉందని వాతావరణ , నీటి కాలుష్యం పెరిగిపోయిందని తెలిపారు. గ్రామాల్లో కోతులతోకూడా పెద్ద సమస్య ఏర్పడిందని దీనిని దృష్టిలో పెట్టుకొని ఈ పంటను సాగుచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ , రైతులు పాల్గొన్నారు.

# విజయవంతమైన పశువైద్య శిబిరం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్‌:** ఖమ్మంరూరల్ మండలంలోని వెంకటగిరి గ్రామంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. దీనికి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. అలాగే స్వయంగా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు...పశువులకు ముందస్తుగా ఏటువంటి అనారోగ్యాలు సంభవించకుండా...ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైద్యుల సైతం పశువుల సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను యజమానులకు ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ముత్యం చిన్న కృష్ణారావు, ఉప్పుగండ్ల ప్రసాద్, కార్యదర్శి ఆంజనేయులు కాంగ్రెస్ యువజన సంఘం నాయకులు కందుకూరి వెంకటనారాయణ, డాక్టర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లోరుగూడెం 11వ వార్డులో సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే జరిగే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించి ఫారంలో సామాజిక, ఆర్థిక,విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ప్రతీ కుటుంబం నుండి సేకరించి నమోదు చేయాలన్నారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తేవాలని, నమోదు చేసిన వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. సేకరించిన వివరాలు వారికి కేటాయించిన సెంటర్ల వద్ద డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇచ్చి నిర్దేశిత సమయంలో ఎంట్రి చేయించాలన్నారు. ఈ సర్వే వల్ల ప్రభుత్వ పథకాలు మరింత సమర్థవంతంగా రూపొందించడానికి వీలవుతుందని, కాబట్టి ప్రతీ ఒక్కరూ, ఆధార్, రేషన్, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలు తమ వద్ద ఉంచుకుని సర్వే కోసం వచ్చిన వారికి అందించి నమోదు చేయించుకోవాలన్నారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఎన్యూమరేటర్లు శ్రద్ధతో విధులు నిర్వహించాలన్నారు.

## నేటి నుండి కార్తీక ఏకాదశి మహోత్సవాలు





**ప్రజాపక్షం/కామేపల్లి:** నేటి నుండి కామేపల్లిలోని బాలత్రిపుర సుందరి సహిత ఇష్టకామేశ్వరి స్వామి దేవాలయంలో కార్తీక ఏకాదశి మహోత్సవాలు జరుగునున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు గొట్టిపర్తి శివాజీ తెలిపారు. ఈసందర్భంగా నిత్యం కార్తీక మాసం నెల రోజులు జరిగే నిత్యభిషేకాలతో పాటు కాదశి సందర్భంగా సోమవారం ఆలయంలో శివ నామ ఏకాహం సంకీర్తిన, 12వ తేదీన హరే రామ నామ సంకీర్తన ఏకాహం జరుగుతాయని ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు పంచామృత అభిషేకాలు మహాన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 13వ తేదీన రామకృష్ణాపురం సువర్చల సహిత అభయాంజనేయ స్వామి దేవాలయంలో హరే రామ సంకీర్తన ఏకాహం జరుగుతున్నట్లు తెలిపారు. కాగా శివాలయంలో జరిగే అభిషేక పూజ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా శివాజీ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా భగవన్నామ సంకీర్తన కార్యక్రమాలలో సైతం పాల్గొనవలసిందిగా భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## భద్రాచలం సమీపంలో గంజాయి స్మగ్లర్లకు దేహశుద్ధి

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం సమీపంలో గంజాయి స్మగర్లకు ప్రజలు దేహశుద్ధి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సమీప ఎటపాకలో వేగంగా వస్తున్న కారును పోలీసులు సాధారణ తనిఖీల్లో ఆపేందుకు ప్రయత్నంచగా కంగారు పడ్డ కారును అతివేగంగా తోలే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రోడ్డుప్రక్కకు వెళుతున్న మేకల మందలోనికి కారు అతివేగంగా దూసుకుపోవడంతో రెండు మేకలు అక్కడిక్కడే మృతి చెందాడు. దీంతో మరింత కంగారు పడిన కారులోని వారు ప్రక్కనే ఉన్న విద్యు స్థంబానికి గుద్దుకోవడం కారు ఆగిపోయింది. పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడి చేరుకున్న ప్రజలు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం కారును తనిఖీ చేయగా కారులో గంజాయి లభ్యం కావడంతో కారును స్టేషన్‌కు తరలించి కారులో ఉన్న వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

## వరిగడ్డికి పెరిగిన గిరాకీ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలంలో ఖరీఫ్ లో పండిన వరి పంట గడ్డికి గిరాకీ పెరిగింది. ఈ ఖరీఫ్ కాలంలో 33,400 ఎకరాలలో వరి పంట సన్న, లావు రకం వరి పంటను సాగు చేశారు. ఈ సంవత్సరం సాగర్ ఆయకట్టు కింద పుష్కలంగా నీరు లభించడం వర్షాలు అనుకూలంగా ఉండటంతో పంటలు సక్రమంగా పొందడం వలన వరి పంట దిగుబడి తో పాటు ధాన్యం కు పెరిగిన గిరాకీతోపాటు గడ్డికి కూడా అదే విధంగా పెరిగింది. ట్రాక్టర్ ట్రక్కు 100 బొద్దులు ఒక్కో బొద్దు 120 పైగా అన్ని ఖర్చులు కలిపి 18 వేల వరకు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. కల్లూరు మండలం నుంచి కృష్ణ జిల్లా మెట్ట ప్రాంత రైతులు తునికిపాడు, మిట్టగూడెం, ఊటుకూరు, దుండిరాలపాడు మరియు ఇతర జిల్లా రైతులు కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. ఇదే అదునుగా మండల రైతులు ఒకేసారి ధరను పెంచేశారు. మొదటిసారిగా కోసిన పంటకు వచ్చిన వరిగడ్డికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు కిష్టయ్య బంజర, పుల్లయ్య బంజర, కల్లూరు, లక్ష్మీపురం, బోడి మల్లె, చంద్రుపట్ల, రఘునాథ గూడెం తదితర ప్రాంతాలలో ఇతర జిల్లాల నుంచి వచ్చి గడ్డిని ట్రాక్టర్ల పై పశుగ్రాసం కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి





**ప్రజాపక్షం/పాల్వంచ:** ఏ ఒక్కరు కూడా మిస్ కాకుండా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సర్వే ఎన్యూమరేటర్లను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభమైన నేపథ్యంలో ఆదివారం జిల్లా కలెక్టర్ పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లోరిగూడెం 11వ వార్డులో పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించి వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకుని ఇబ్బందులు ఉంటే సూపర్వైజర్లకు, ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఈనెల 6 నుండి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామని శనివారం నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ మరియు కుల వివరాలను ప్రతి కుటుంబం నుండి సేకరించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆదివారం రెండవ రోజు సర్వే ఎన్యూమరేటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తగా వివరాలను పొందుపరచాలని అన్నారు. దాదాపు 57కు పైగా అంశాలలో వివరాలను నమోదు చేయవలసి ఉన్నందున ఎన్యూమనేటర్‌కు ఒక సహాయకులను నియమించుకుటే బాగుంటదని సూచించారు. ప్రతి ఒక్క బ్లాకుకు ఒక ప్రత్యేక ఎన్యూమరేటర్ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. నమోదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. నమోదు చేసిన వివరాలను ప్రతి ఎన్యూమరేటర్ వారికి కేటాయించిన కేంద్రాలలో డేటా ఎంట్రీ సిబ్బంది ద్వారా ఎటువంటి పొరపాటు లేకుండా ఆన్లైన్‌లో నిర్దిష్ట సమయంలో నమోదు చేయించాలన్నారు. ఈ సర్వే వలన ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి అవకాశం మెరగవుద్ది కాబట్టి ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దోపిడి లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యం



**ప్రజాపక్షం/కారేపల్లి:** దోపిడిలేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర నాయకులు పి సోమయ్య అన్నారు. సీపీఎం సింగరేణి మండల మహాసభ ఆదివారం దమ్మాలపాటి వెంకటేశ్వర్లు నగర్, భూక్య జగ్యా, రేపాకుల లాలయ్య ప్రాంగణంలో ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగింది. ఈ మహాసభకు తలారి దేవ ప్రకాష్, దాసరి మల్లయ్య, సూరబాక ధనమ్మ అధ్యక్షత వర్గం వ్యవహరించిన ఈ సభలో పి సోమయ్య మాట్లాడుతూ పెట్టుబడి దారి, రాచరిక రాజ్యాంగాలు కల దేశాల ఆర్థిక వ్యవస్థలు కూప్పకూలి పోతున్నాయని ప్రత్యామ్నాయంగా సోషలిజం, కమ్యూనిజం వ్యవస్థలు ఏర్పాడుతున్నాయన్నారు. అనంతరం మండల కార్యదర్శి కె నరేంద్ర కార్యదర్శిని వేదికను ప్రవేశపెట్టారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మూడ్ శోభన్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, కొంబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, రేపాల శ్రీనివాస్, మెరుగు రమణ, చింతల రమేష్, వజ్జా రామారావు, వడ్డె అజయ్‌బాబు, బానోత్ భారతి, అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, ముక్కా సీతారాములు, సదానందం, లక్ష్మీ నర్సయ్య, బానోత్ బన్సీలాల్, మోత్కూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్య, వైద్యాన్ని అందించాలి

## రూ.50 వేల విలువైన మందులను అందించిన ఆప్



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** పేదలకు ఉచిత విద్య, వైద్యం ను అందించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు నల్లమోతు తిరుమలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హస్పిటల్ కు మందుల కొరత వలన ప్రజల ఇబ్బందులను గమనించిన ఆమ్ ఆద్మీ పార్టీ పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ ఆదివారం పెట్రోల్ బంక్, హోటల్ లో పనులు చేసిన కూలీ తో పాటు దాతల నుంచి సేకరించిన విరాళాలతో దాదాపు రూ.50 వేల విలువైన మందులను ప్రభుత్వ హస్పిటల్ కు ఆదివారం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు...విద్యా వైద్యం కు రోల్ మోడల్ గా కేజ్రీవాల్ నిలిచారని అన్నారు. ఢిల్లీ ప్రభుత్వం అందిస్తున్న తరహాలోనే విద్య, వైద్యం సేవలను అందించాలని కోరారు. పేదల కోసం నిరంతరం పని చేస్తున్న శ్రీనివాస్ ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం పేదల వైద్యం పట్ల నిర్లక్ష్యంగా ఉందని అన్నారు. నాణ్యమైన విద్య,వైద్యం ను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, కల్లూరు మండల పరిధిలోని 63 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ బూత్ అధికారులు ప్రత్యేకంగా శని, ఆదివారాలలో గ్రామపంచాయతీ మరియు పాఠశాలలో రెండు రోజులు పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ రాజేంద్ర, తహశీల్దార్ పులి సాంబశివుడు, డిప్యూటీ తహశీల్దార్ బాబ్జి ప్రసాద్, ఆర్ఐ అన్వర్, సుజాతలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

# సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/పెనుబల్లిః**పెనుబల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన చక్రవర్తి గోల్కొండ కోటను ఏలిన తొలి బహుజన వీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న పోరాట ఘన చరిత్ర గురించి ప్రజలకు వివరించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని గౌడ సోదర కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉంటామని, వారి సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాల సహకరిస్తామని, త్వరలో మరికొన్ని కాటమయ్య రక్షణ కిట్లుగౌడ సోదరులకు అందిస్తామని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తోడు కుటుంబాలకు అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం పెనుబల్లి మండల గౌడ సంఘం కార్తీక మాస వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పెనుబల్లి మండల గౌడ సంఘం అధ్యక్షులు, గౌడ సంఘం కమిటీ సభ్యులు, విగ్రహ కమిటీ సభ్యులు, విగ్రహ దాతలు మరియు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకులు వెంకటరామనర్సయ్య మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ మండల నాయకులు దారెడు గ్రామానికి చెందిన సోంటి వెంకటరామనర్సయ్య (75) ఆదివారం మృతి చెందారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిర్వహించిన పలు ఆందోళన కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తదితరులు దారెడు చేరుకుని నివాళులర్పించారు. అరుణ పతాకాన్ని కప్పి జోహార్లు అర్పించారు. జోహార్లు అర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, నాయకులు ఉసికల రవికుమార్, బండి ఉపేందర్, నూర్‌షా, జిలానీ, వెంకన్న తదితరులున్నారు.

# ఉపాధ్యాయుడిని అవసరమున్నచోట ఏర్పాటు చేస్తాం : డీఈఓ

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని ఒంటిగుడిశా తండాకు సంబంధించి ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులు లేని పాఠశాల అనే వార్త కథనం ఆదివారం ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రజాపక్షం విలేకరితో మాట్లాడుతూ, ఒకే ఉపాధ్యాయుడిగా ఉంటూ పాఠశాల లో విద్యార్థులు లేకుండా ఉన్నందున ఆ ఉపాధ్యాయుడి సేవలను అవసరమున్న చోట వీలైనంత త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు.

# నందూరి నర్సిరెడ్డికి శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటి మెంబర్ గా నందూరి నర్సిరెడ్డిని ఎంపిక చేయడంతో టిడిపి జిల్లా నాయకులు తాతా సుధాకర్ దంపతులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు భద్రాచలం శ్రీరాముల వారి చిత్రపటాన్ని ఆయనకు అందజేసి శాలువాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాతా సుధాకర్ మాట్లాడుతు అధికారం ఉన్నా లేకున్నా నర్సిరెడ్డి పార్టీ పట్ల అంకితభావం పార్టీ అభివృద్ధికి పనిచేశాడని అన్నారు. ఆయన నిబద్ధదతకు ఫలితం దక్కిందని అన్నారు. ఈకార్యక్రమంలో సుధాకర్ సతీమణి తాతా మాధవిలత , అజీమ్ పాల్గొన్నారు.

# ముగిసిన రాష్ట్ర స్థాయి ఖో ఖో క్రీడలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని 68వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ 17 ఖో ఖో క్రీడలు ఆదివారం ముగిశాయి. ఈ క్రీడల్లో 10 పాత జిల్లాల క్రీడాకారులు కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నందు ఆదివారం ఉత్సాహంగా పోటాపోటీగా జరిగాయి. ఈ క్రీడల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానాన్ని నిజామాబాద్, రెండవ స్థానాన్ని నల్గొండ, మూడో స్థానాన్ని ఖమ్మం, నాలుగో స్థానాన్ని రంగారెడ్డి, జిల్లా ఖో ఖో జట్లు కైవసం చేసుకున్నాయి. వారికి ప్రశంస పత్రాలు, మెడల్స్, కప్పులు అందించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు శివరాం, ప్రధాన ఉపాధ్యాయులు శ్రీహరి, పామర్తి శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా టీం ఇన్చార్జి గుంటుపల్లి రమాదేవి, మేనేజర్ సిహెచ్ శ్రీదేవి, పద్మావతి కృష్ణారావు, నరసయ్య, ఎస్కే రంజాన్, ఎన్ వెంకటేశ్వర్లు, సైదులు, రాము, ఖో ఖో కోచ్ దుర్గారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి బీమా పశువులేటి వీరరాఘవయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిసెంబర్ ఐదు నుంచి 8 వరకు అయోధ్యలో జరిగే జాతీయస్థాయి ఖో ఖో క్రీడలకు జట్టును ఎంపిక చేశారు.

# ఉత్సాహంగా ఆర్యవైశ్యుల వన సమారాధన





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు పట్టణ పరిధిలోని ఆర్యవైశ్యులు ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా వన సమారాధన కార్యక్రమాన్ని చంద్రుపట్ల రోడ్డులో రమణయ్య మామిడి తోటలో జరుపుకున్నారు. ఆర్యవైశ్యులు ఆట, పాట నృత్యాలతో సందడి చేశారు. మహిళలు పురుషులు, చిన్నారులు దేవుని పాటలకు, సినిమా పాటలకు నృత్యాలు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా మామిడి తోటలో కుటుంబాలతో గడిపారు. మామిడి తోటలో ఉన్న ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన పసుమర్తి చందర్‌రావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చలువాది నగేష్ , అనుమోలు శ్రీనివాసరావు , సంకా రాంబాబు, పూర్ణయ్య, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

# అమరుల ఆశయాలను కొనసాగిద్దాం

**సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అమరుల ఆశయాలను కొనసాగిద్దామని వారు ఏ లక్ష్యం కోసం పనిచేశారో ఆ లక్ష్య సాధనకు పునరంకితం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ప్రొద్దుటూరు గ్రామంలో కన్నెపోగు పెద్దశేషయ్య, ముత్తమ్మల స్మారక స్తూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ మాట్లాడుతూ అనేక నిర్బంధాలను ఓర్చి పెద్ద శేషయ్య కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేశారన్నారు. తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడన ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు నిర్వహించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలకులు ప్రజలను మరిచి పాలన సాగిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలను ఉధృతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే అమరులకు మనమిచ్చే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్, మండల నాయకులు పదిమల వెంకటనర్సయ్య, గ్రామశాఖ కార్యదర్శి తాళ్లపల్లి అజయ్, గ్రామ నాయకులు గోపాల్, నాగరాజు, కోటయ్య, పెద్ద సంఖ్యలో సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్టియు అధ్యక్ష, కార్యదర్శులుగా దొడ్డ, కరామత్





**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం తెలంగాణ ఖమ్మంజిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం 2024 మరియు 2025 సంవత్సరాల నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ నేతృత్వంలో ఆదివారం సంఘ కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 1996లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన దొడ్డా వరప్రసాదరావు ప్రస్తుతం వైరా మండలం రెబ్బవరం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. 2000 సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన కరామత్ అలీ ప్రస్తుతం కొణిజర్ల మండలం లక్ష్మి పురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వరప్రసాదరావు, ఎస్‌కె కరామత్అలీ, అసోసియేట్ అధ్యక్షులుగా గోపాలరావు, బానోత్ రాము, ఉపాధ్యక్షులుగా చిరంజీవి, జానకి రాణి, శ్రీకాంత్, మాలిని, జగదీష్, ప్రసాద్, జలగం, బోణాల వెంకటేశ్వరరావు, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఎన్. అరుణాకర్‌రావు, సైదా, కార్యదర్శులుగా సిహెచ్ ఐజాక్, నరేందర్, శైలజ, కోటయ్య, మక్బూల్ ఖాన్, ఆర్థిక కార్యదర్శిగా కె. శ్రీధర్‌బాబు, ఆర్థిక కమిటీ సభ్యులుగా సైదులు, అఫ్జల్ జానీ, మహిళా కార్యదర్శిగా వనజకుమారి, సహాయ కార్యదర్శిగా సావిత్రిలను ఎన్నుకున్నారు. వారికి సంఘం తరుపున అభినందనలు తెలిపారు.

# అమరవీరుల త్యాగాలు వృథాకావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అమరవీరుల త్యాగాలు వృథాకావని సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర నాయకులు నాగన్న , డేవిడ్ కుమార్ అన్నారు. మండల పరిదిలోని రామనర్సయ్యనగర్ లో ఆదివారం రాత్రి ఆపార్టీ బహిరంగసభ ఆంగోత్ భాషా అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతు సిపిఐఎంఎల్ అగ్రనాయకులు చంద్ర పుల్లారెడ్డి , ఖమ్మం జిల్లా వాసి శ్రీపాద శ్రీహరి , బత్తుల వెంకటేశ్వర్లురావు , నీలం రామచంద్రయ్య, నాటి ఎంఎల్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి పొట్ల రామనర్సయ్య లాంటి వాళ్లను 1975 ఎమర్జెన్సీ లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కల్పి చంపిందని అన్నారు. అమరవీరుల సందర్భంగా గ్రామంలో ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సభలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మి నారాయణ , జిల్లా నాయకులు బజ్జూరి వెంకట్రామిరెడ్డి , పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు విప్లవకుమార్ , పిఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు కోలా స్వప్న , అధ్యక్షురాలు వరకాల లక్ష్మి , సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసిం , అరుణోదయ జిల్లా అధ్యక్షులు బాణోత్ కిషన్ , భూక్యా శంకర్ , పఠాన్ ఖాసిం ఖాన్ , గుగులోత్ దస్రు , తడికమళ్ళ సీతయ్య, రాచబంటు చందు , గుగులోత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా కొనసాగుతున్న సమగ్ర సర్వే



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో సమగ్ర సర్వే పకడ్బందీగా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే ఎలాంటి తప్పులు లేకుండా సర్వే సిబ్బంది పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రశ్నావళి సేకరణలో నోడల్ అధికారులు జాగ్రత్తలు పాటించాలని, సూపర్వైజర్లు సర్వే సిబ్బందిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, రోజువారీగా సర్వే చేసిన పూర్తి వివరాలను ఆరు గంటలకల్లా పర్యవేక్షకులకు అందించాలని ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే సవరించుకోవాలని ఆర్డీఓ, తహశీల్దార్ లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాలలో ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు శ్రీనిధి విద్యార్థిని



**ప్రజాపక్షం/ మధిర :** కల్లూరులో గత మూడు రోజులుగా జరిగిన అండర్ 17 బాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో శ్రీనిధి కాన్సెప్ట్‌స్కూల్ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సిహెచ్.దుర్గాభవాని కెప్టెన్‌గా జిల్లా జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిందని, ఆ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర పరిశీలకులకు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు తెలంగాణ జట్టులోకి ఎంపిక చేశారని స్కూల్ కరస్పాండెంట్ అండ ప్రిన్సిపాల్ బి.అంజనీబాబు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఆయనతో పాటు స్కూల్ డైరెక్టర్ సిహెచ్.చందు, పిఇటి కె.శివ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# గ్రామపంచాయతీ నూతన భవనానికి మోక్షమెన్నడో..?




**-ఏళ్ళు గడుస్తున్నా**
**భవన నిర్మాణం కలగానే మిగిలి పోతుందా...!**
**-మంజూరు చేసి రెండు సంవత్సరాలు..**
**-ఇప్పటికీ పూర్తిగా నిర్మాణం కాలే..!**

**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల కేంద్రమైన కరకగూడెంలో మెరుగైన పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయాలను నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. చాలా కాలం నుండి గ్రామపం చాయతీ కార్యాలయం కొత్తగా నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు గ్రామ పంచాయతీ నిధులు మంజూరు చేసిన నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు. భవన నిర్మాణ పనులను చేపట్టడా నికి ఎవరు ముందుకు రాకపోవడంతో ఎక్కడ ఉన్న గొంగళి అక్కడే ఉన్నట్లు తయారైంది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని తెలిసిన కాంట్రాక్టర్లతో పనులు చేయిద్దామన్న బిల్లులు సమయానికి వస్తాయని నమ్మకం లేకపోవడంతో ఎవరు ముందుకు రావడం లేదు. దీంతో తాటిగూడెం గ్రామపంచాయతీ నూతన భవనం కలగానే మిగిలి పోతుందా.. అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



**గ్రామపంచాయతీ భవనాన్ని త్వరగా నిర్మించాలి...**
**ఆదివాసి జేఏసి మండల అధ్యక్షులు పోలేబోయిన వెంకటనారాయణ**

ఈ మండలంలో కొన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి సంక్షేమ లపై ప్రతి రెండు నెలలకోకసారి పంచాయతీ పాలకవర్గం వివిధ శాఖల ఆధ్వర్యంలో పనులపై గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీకి సరిపోను భవనం లేనందున ఇలాంటి సమావేశాలను ఇరుకు గదుల్లో, చెట్ల కింద, వరండాలో, టెంట్ల కింద నిర్వహించాల్సిన దుస్థితి ఉంది. ఇలాంటి సమస్యలను దృష్టిలో పెట్టుకుని నూతన భవనాన్ని నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకొని నూతన భవనాన్ని సకాలంలో పూర్తి చేయాలి.

## యుద్ధప్రాతిపదికన సభ్యత్వం నిర్వహించాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా తల్లాడ మండల వ్యాప్తంగా సభ్యత్వాల కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభిస్తున్నట్లు సిపిఐ జిల్లా సమితి సభ్యులు మద్దోజు శ్రావణ్‌కుమార్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వంద ఏళ్ల చరిత్రలో ఎన్నో ఉద్యమాలు చేసిందని, ఆ ఉద్యమాలు విజయవంతం అయ్యాయని భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో, తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిలో ఉద్యమించి విజయం సాధించాయని ఆయన అన్నారు. అంతేకాకుండా తెలంగాణ సాయుధ పోరాటం ఇది ఎన్నో లక్షల ఎకరాలు బడుగు, బలహీన వర్గాలకు అందించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీకి ఉందని, ఈ రోజు వందో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గడపగడపకు సిపిఐ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా తీసుకున్నారని, అందులో భాగంగా తల్లాడ మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ పాత, కొత్త కార్యకర్తలు సభ్యత్వాలను నమోదు చేయడంలో మండల నాయకత్వం ముందుండాలని, ఇది కమ్యూనిస్టు పార్టీ ఎంతో బలోపేతం ఉంటేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి పని చేపించే సత్తా ఈ కమ్యూనిస్టు పార్టీకి ఉంటుందని ఆయన తెలిపారు.

# ఒకే ఇంట్లో నివాసం ఉంటే బహుళ కుటుంబాలను విడివిడిగా సర్వేచేయాలి



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కుటుంబ సర్వేలో ఒకే ఇంట్లో నివాసం ఉంటున్న వివాహం అయిన వారికి చెందిన వివరాలు, ఒంటరి మహిళలు వివరాలు విడిగా నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లోజరిగిన స్టడీ సర్కిల్‌లో రాంబాబు మాట్లాడుతూ కుటుంబ సర్వే వివరాలు ప్రశ్న ప్రజల్లో ఉన్న భయాందోళనలపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం నూతన సంవత్సరంలోపు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా స్టడీ సర్కిల్ కన్వీనర్ బొంతు సమత, సిపిఎం వైరా మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, పారుపల్లి చంద్రశేఖర్‌బాబు, పారుపల్లి కృష్ణారావు, నారికొండ అమరేంద్ర, వల్లమాడి మధు తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శివనాయక్ అన్నారు. ఆదివారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లాడ మండలంలో వందలాది మంది విద్యార్థులు ఉన్నారని, ప్రభుత్వ కళాశాల అందుబాటులో లేక చాలా ఇబ్బంది పడుతున్నారని, కళాశాల కోసం వైరా, ఏన్కూరు, కల్లూరు ఇలాంటి ప్రాంతాలకు వెళ్లి చదువుకునే దుస్థితి ఈ రోజుల్లో కూడా ఉందని, ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్నిసార్లు పాలకులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తల్లాడ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, అదేవిధంగా డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేసి ఈ ప్రాంత విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమ దృశ్యాలు











## పంచాయతీ భవన నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు..!



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పనులలో పంచాయతీ రాజ్ అధికారులు నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి 20 లక్షల రూపాయల వ్యయముతో చేపట్టిన గ్రామపంచాయతీ నిర్మాణ పనులను ప్రభుత్వాన్నిబంధనలు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేయాల్సి ఉండగా, అధికారులు మాత్రం నాణ్యత ప్రమాణాలను పట్టించుకోకుండా ఆ పని వైపు కూడా తిరిగి చూడకుండా నిబంధనలకు విరుద్ధంగా మట్టి ఇసుక తో భవన నిర్మాణ పనులను గత కొన్ని రోజుల నుండి చేయిస్తున్నారు. ఎంతో కాలం ప్రజల కు ప్రభుత్వ వ్యవహారాలు గ్రామపంచాయతీ వ్యవహారాలు నిర్వహించుకొనుటకు నిత్యం ఉండే భవనము నాణ్యతతో నిర్మించాలనిగ్రామ ప్రజలుకోరుతున్నారు.

**ప్రైవేట్ వ్యక్తులు పనుల పరిశీలన...**

మండలంలోని పంచాయతీరాజ్ విభాగం నుండి నిర్వహించే వివిధ రకాల పనులను( సిసి రోడ్లు ,భవన నిర్మాణాలు, సైడ్ డ్రైన్లు) ప్రభుత్వ అధికారులు కాకుండా వారి కింద వారికి ఇష్టం వచ్చిన కొందరు ప్రైవేటు వ్యక్తులను పెట్టుకొని నెలవారీగా వీరే జీతాలు ఇస్తూ తమ పనులను చక్కదిద్దడం కోసం వారికి వర్కింగ్ స్పెక్టర్లు అనే పేరు పెట్టి ఒకరకంగా వారే అధికారిగా చలామణి అవుతూ గ్రామాల్లో నిర్వహించే సిసి రోడ్ల నిర్మాణ పనులు పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రభుత్వ అధికారి రాకుండానే వీరే నిర్వహిస్తున్నారు. దీని వలన ప్రజాధనం వృధా అవుతుందనే విమర్శ వినిపిస్తుంది ఇప్పటికైనా అధికారులు ప్రైవేటు వర్కింగ్ ఇన్స్పెక్టర్ల వ్యవస్థను రద్దు చేసుకొని అధికారులే స్వతాగ వచ్చి పనులను పరిశీలించాలని పలు గ్రామాల్లో ప్రజలు కోరుతున్నారు.

**పిఆర్ఏఈ రామాల రైని హార్డ్ బొనికి వివరణ**

నేను వెళ్లి చూడలేదు చూసిన తర్వాత మీతో మాట్లాడతాను అన్నారు.

## రైతుల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుంది..

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని,రైతు కోసమే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు.మండల పరిధిలోని రేజర్లలో ఐకేపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం మార్కెట్ కమిటి చైర్మన్ దోమ ఆనంద్‌బాబు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పనిచేసిన దాన్యానికి సరైన మద్దతు ధర రాకుంటే ఎంత ఇబ్బంది పడతాడో గుర్తించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,దేశంలోనే ఏ రాష్ట్రం ఇవ్వని మాదిరిగా మొట్టమొదటిసారి తెలంగాణ రైతాంగానికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తుండటం రైతాంగ గర్వించ దగ్గ విషయమన్నారు.దళారి వ్యవస్థను రూపుమాపి స్వయంగా రాష్ట్ర ప్రభుత్వం దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుండి దాన్యం కొనుగోలు చేసి నేరుగా రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేస్తుందన్నారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో సోసైటి అద్యక్షులు కొప్పుల



రాఘవరెడ్డి,భూమా నాగిరెడ్డి, శ్రీనివాసరావు, రామ్‌మోహన్, బాలకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, జక్కుల ప్రభాకర్,ఐకేపి ఏపిఎం సుబ్బారావు, ముత్తయ్య, మలేశ్వరి, సరోజిని,ప్రసాద్, విజయ్,దుర్గ, లక్ష్మి , సౌజన్య, నాగమణి, జమున,భవాని తదితరులు పాల్గొన్నారు.

## తిరుపయ్యకు బిపి నాయక్ ఘననివాళి



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని చిరునోముల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెల్లబోయిన తిరుపయ్య అదివార తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బిపి నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీనియర్ నాయకులు తిరుపయ్య సేవలు అభినందనీయమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ ములకారపు రవి, మాజీ ఉపసర్పంచ్ ఆముదాల పుల్లారావు, గ్రామ శాఖ అధ్యక్షులు గూడ నరసింహ శాస్త్రి, మహిళ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిర్రా అదిలక్ష్మి , యువజన కాంగ్రెస్ నాయకులు చావాల రాజేష్, ఆముదాల వెంకటేష్, బిరెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే తీరు పరిశీలన

**ప్రజాపక్షం/కారేపల్లి:** అత్యంత ప్రతిష్టాత్మకంగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం అయిన సమగ్ర కుల గణన కార్యక్రమం తీరును ఎన్యుమారేటర్ల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని, అడిగిన ప్రశ్నలకు ఎటువంటి అపోహలకు గురి కాకుండా సమాధానాలు ఇవ్వాలని, తద్వారా ప్రభుత్వ అంచనాలు ఉంటాయని, అందరు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని మండలాల కంటే ముందే మన మండలం పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపిటిసి బానోత్ రాంచందర్, గుగులోత్ హచ్చు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గూగులోత్ వంశీ డిమాండ్ చేశారు. ఆదివారం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ హాస్టల్ సందర్శనకు వెళ్లిన ఆయన మండలంలో ఉన్న పలు హాస్టల్లో సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కాస్మోటిక్ మెస్ చార్జర్ పెంచుతూ నిర్ణయం తీసుకుందని, దాన్ని అభినందిస్తూ నరసాపురం లో ఉన్న బాలికల హాస్టల్ ముఖ్యంగా ప్రహరి గోడ కూడా లేదని హాస్టల్ గుట్ట పక్కన ఉండటం వలన ఎప్పుడు ఏం జరుగుతుందని విద్యార్థుల తల్లి దండ్రులు భయ భ్రాంతులకు గురవుతున్నారన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు సాయి తేజ, రామ్ చరణ్ , తేజ పునీత్ కుమార్, హేమంత్ తదుతరులు పాల్గొన్నారు.